# మెఋపులు: సాహితీ సమూహం

- వేమూరి వేంకటరామనాథం

కొన్ని సంవత్సరాలుగా న్యూజెర్సీలో నా అధ్యక్షత క్రింద జరుగుచుండిన సాహితీ సమూహం ఈ మధ్య కొన్ని యేండ్లుగా నిదుర పోయింది. కాని సాహిత్య-అభిమానంగల మిత్రులెందరికో అలాంటి సమూహ చర్చలపై దృష్టి ఉంటూనే యుంది. శ్రీమతి వైదేహి, శ్రీమతి రాధ, శ్రీభావరాజు మూర్తి వంటి ఔత్సాహికులు ఈ నాటికి తిరిగి అలాంటి సభలను ఏర్పాటు చేయగల్గినందుకు వారికి నా అభివందనలు. వారి ప్రయత్నం విజయవంతం కావాలన్న నా ధ్రుఢ మనోరథం ఈ సందేశంద్వారా మీకు అందజేస్తున్నాను.

ఈ సభల పునరుద్ధరణ ఈ దేవాలయంలో శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో ఆరంభమవుతున్నదన్నది ఒక గమనీయ అంశం. ఆయన రక్షణలో ఈ సభలు విజయవంతం అవుతాయని నా కోరిక, నా నమ్మకము.

ఆ భగవంతుని దయ, ఆశీర్వచనాలు మనకు దక్కవలెనంటే తగువిధంగా సభా నిర్వహణ జరుప వలసిన బాధ్యత మన మీదనే ఉంది. దేవునివి ఆశీస్సులు, మనది తగు ప్రయత్నం. ఆసక్తితోనే కాక, శక్తితో ఈ కార్యం నిర్వహించగల ఉద్దేశ్యం, దాని దీటైన వైదుష్యం గలవారి కృషితో ఈ సభలు ఫలవంతం కాగలవని నా అభిప్రాయం. నా అనుభవం వలన ఒక విషయం నివేదిస్తాను. సారస్వత సభలు నడపగలవారి ఉత్సాహానికి తగినట్లు సాయం చేసే మిత్రులు తమ సారస్వత-ఉత్సాహ శక్తులను ప్రదర్శిస్తూ, సభలను ఫలవంతం చేయవలెనని నేను కోరుతున్నాను. క్రమంగా అలా జరగ గలదన్న నా నమ్మకం మీకు తెలుయజేస్తున్నాను.

ఏలనంటే, ఈ ఉత్సుకుల రచనలు కొన్ని నేను చూస్తూనే ఉన్నాను. శైలిలోని తప్పని సరి భేదాలటుంచి, వారి రచనలలో లోతైన భావనాశక్తి శరత్కాలపు శంపాలతవలె ప్రత్యక్షమవుతూనే ఉంది.

మీరు ఓపిక పట్టితే, రెండు చిన్న సలహాలు ఇస్తాను. ఒకటి, సారస్వత సమావేశంలో ఏదైనా చదువ దల్చినవారు, తాము వ్రాసే పద్యమో, గద్యమో, గద్యపద్యమో, స్పష్టమైన ప్రయత్నం ఆధారంగా అల్లాలి. క్షమించండి, "అరే ఎవ్వరూ లేరే చదివేవార"ని గబగబా సభ జరుగుతూ ఉండగా కాగితం మీద కలం జరపటం అంత ప్రశంసనీయం కాదు. సభకు ముందే ఇంటి యొద్ద తగు పరిశ్రమ జేసి, దాని ఫలితంగా కాగితం మీద ఫలించే వ్రాతను సభలో చదువుట శ్రేయస్కరం.

రెండవది, ఇలాంటి సభల ప్రయోజనం, ఒకరు తన రచనలను ఇతరులకు వినిపించటం మాత్రమే కాదు, దానికి దీటుగా ఇతరుల విమర్శనలు అభిలాషతో, ఆనందంగా, తెలిసికొనటం; పైన వీలయిన సవరణలు తమ రచనలలో చేసికొనటం. క్షమించండి, యీ సలహా "ఇతరుల విమర్శనలు నాకు ప్రయోజన కరములే" అని విశ్వసించే తలంపు కలవారికి.

ఇక అది యిది వ్రాసి మీ కాలం వ్యర్థం చేయను. భగవంతుని ఆలయంలో జరుగుతున్న ఈ సభ, తరువాత జరిగే సభలు విజయవంతం అవుగాక అని కోరుతున్నాను. దూరాభారం వలన నేను రాలేక పోతున్నాననే అని నా విచారం తెలుపుతున్నాను. కాని శ్రీమతి రాధ వంటివారి దీక్షతో ఈ సభలు జయప్రదం అవుతాయని, తగు సహాయం సభ్యులందరినుండి లభ్యమవుతుందని, విశ్వసిస్తూ, నా అభినందన తెలుపుతున్నాను.

ఈసమితి సభలకు వచ్చేవారు అమెరికాలో స్థిరపడినవారు ప్రధానవర్గంగదా. వీరికి ఇండియాలో ఉన్నవారికి దక్కినట్లు ఇతర రచయితలతో సంప్రదింపునకు అవకాశాలు తక్కువ. (ఈసమావేశాలకు ఎంత తక్కువ వస్తారో గమనిస్తే చాలు నేను చెప్పే విషయం స్పష్టమవుతుంది.) ఆకారణంగా, నలుగురు ఉమ్మడి ఆశయాలతో సారస్వత సభను జరిపితే, వారిలో పరస్పర చర్చలకు కొంతగానైనా అవకాశం ఉంటుంది. ఈ సమితి సభలలో ఒక ప్రత్యేక విశేషమేమంటే, ఒకరు తన రచనను చదివిన పిదప దానిపైన చర్చ ఉంటుంది. ఎవరో ఒకరు - ముఖ్యంగా కొంచెం పెద్దవారు - వయసులో కాని, రచనాభావంలో కాని - చిన్న సమీక్ష మొదలు పెడితే మిగతవారు కూడ

తమకు గల అభిప్రాయాలు బైటపెడతారు. వ్యాస (లేక పద్య) రచయితులకు వాటికి తగురీతిని ప్రత్యుత్తరమిచ్చే అవకాశం ఉంటుంది. అతడు (లేక ఆమె) వ్రాసిన శబ్దజాలంలో తనకు గల మూల - ఉద్దేశ్యం స్పష్టంగా బయలు పడుతున్నదో లేదో సభికుల భాషణలో కొంతగానైనా వివరింప బడుతుంది. ఈ కారణంగా రచయిత తన రచనలలో తగిన మార్పులు చేసికొనటానికి అవకాశం ఉంటుంది. (ఇది ఇతరుల అభిప్రాయాలను, సూచనలను గౌరవించి, వీలయినంతవరకు వాటివలన ప్రయోజనం అర్ధించేవారిని మనసులో పెట్టుకొని చెప్పుతున్నామాట.)

ఈ సారస్వత సభల ప్రయోజనం రెండు విధాలదని పాఠకులు గ్రహించియుందురు. ఒకటి, రచయిత తన పద్యం, గేయం, లేక వచనం చదవటం, వినటానికి సమావేశమయిన మిత్రుల సమక్షంలో. రెండు, ఆరచన మీద వారి అభిప్రాయాలు, గుణ విశేషాల గమనికలు, విశదం కావటం. ఇది ముఖ్యమైన ఫలితం. ఏమంటే, వ్రాసినదంతా ఉన్నదున్నట్లు బాగున్నదనిపించుకొనటం అందఱకు అంత సులభ సాధ్యమైన అదృష్టం కాదు. రచనలో ఉన్న ప్రశంసనీయాలేకాక దిద్దుకొన (వలసిన) తగిన అంశాలను కూడ నిష్పాక్షికంగా ఎత్తి చూపగల మిత్రులు అక్కడ ఉంటారుగదా. ఒక చిన్న గమనిక: "మిత్రులు" అన్న పదం ఉపయోగించాను. అనగా, కేవలం కేవలం పొగడటం లేక తెగడటం తమ "సరదా"గా గలవారు కాక, సత్య సాక్షిగా తమకు తెలిసిన త్రోవను గుణ సమీక్ష చేయ జేరినవారు సభలో కలసికొనియుండటం కారణంగా, రచయితకు లభ్యమయిన విమర్శ ప్రయోజనకరంగా ఉంటుంది, రచనను మెఱుగుపెట్టే అవకాశం కలిగిస్తుంది. నిజంగా ఇలాంటి సమావేశాల ముఖ్య ప్రయోజనం ఇది. అయితే ఆలభ్యమైన విమర్శ తగిన విజ్ఞానసోపానం మీద నిల్చియుండాలి. నా అనుభవంలో, ఇది క్రమంగా సాధ్యమవుతుంది. మొదటి ఒకటిరెండు సమావేశాలలో విమర్శలు ఏరీతిని ఉన్నా, వాటికవే క్రమంగా సరి దిద్దుకుంటాయి. ఈ పరిణామ క్రమానికి త్రోవ చూపగల శక్తి అధ్యక్షునిలో ఉంటే, అది సాధ్యం అవుతుంది. అధ్యక్షుని భారం అతి సున్నితమైనది. ఒక ప్రక్క విమర్శనను ప్రేరేపించాలి, మఱొకప్రక్కన దానిలోని గుణగణాలను తాను చర్చించి, రచయితకు ప్రయోజనం - నిరుత్సాహం కాదు - కలిగేట్లు -ఆవిమర్శను మళ్ళించాలి. ఇది ఎన్నో కారణాల వలన, సులభం కాక పోవచ్చును. కాని మన లక్ష్యమది. సభ అయిన పిదప రచయితకు కొంత ప్రయోజనం కల్గినదన్న తృప్తి, సంతోషం కలిగేట్లు ఉండాలి.

మన రచనలమీద సద్విమర్శ ఎంత అవసరమో నేను విస్తృతంగా చెప్పనక్కఱలేదు. ఇది రచయితలు నిశ్చయంగా విశ్వసించాలి. వ్రాసినవి అవకాశం, అవసరం ఉన్నంత వఱకు సన్మిత్రుల సమీక్షకు లోను చేయాలి. "సన్మిత్రు"లంటే - ఇక్కడ - సరసమైన సమీక్ష చేయగల బుద్ధిమంతులు, అని. తిరిగి మన సాహితీ సమూహానికి చెందే ఒక అభిప్రాయం: అందులో ఇలాంటి సమీక్ష ఏ కొంతగా నైనా లభ్యమవుతుంది. మొదటి ఒకటి రెండు సమావేశాలలో ఈ క్రమం అంత స్ఫుటంగా విశదం కాకపోయినా, క్రమంగా అది స్వయంశుద్ధ మవుతుంది. సారస్వత సభలకు, గుణదోష చర్చలకు, అవకాశాలు తక్కువ అయిన యిక్కడి పరిస్థితులలో ఈ సమూహం వంటిది అతి వాంఛనీయ మని నా ఉద్దేశ్యం.

ఈ సమూహ కార్యక్రమంలో మఱొక వాంఛనీయ అంశం పేర్కొంటాను: మధ్యమధ్య తెలుగు కావ్యాలను గురించిన చర్చలను ప్రోత్సహించటం. ప్రాత కావ్యాలను గుఱించి ఎన్నో విషయాలు చెప్పుకోవచ్చును. కొన్ని క్రొత్త చూపులు కూడ ప్రవేశపెట్ట ప్రయత్నించ వచ్చును. ఇటీవలి - అనగా ఆధునిక - కావ్యాలనుగుఱించి కూడ వాటిలో కవితో మౌలిక - గుణం ఎంతవఱకు ఉన్నది అన్న విషయంపై చర్చలు సాగించవచ్చును. గద్యమైనా, పద్యమైనా ప్రధానంగా వలసిన కావ్యత్వం ఎంతవఱకు తక్కువమందన్నది అన్న విషయంపై ఎన్నైనా చర్చలు చేయవచ్చును. వీటికి అవసరం ఉన్నది కూడ. ముఖ్యంగా పద్యం కన్న వచన కవిత ఎక్కువగా వస్తున్నాయీ దినాలలో.